నమ్మ మెట్రో స్టేషన్లకు శంకర్‌నాగ్, అపర్ణ పేర్లు పెట్టాలి

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నమ్మ మెట్రో స్టేషన్లకు ప్రముఖ నటుడు శంకర్‌నాగ్, నటి, యాంకర్ అపర్ణ పేర్లు పెట్టాలని బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ డిమాండ్ చేశారు. ఆదివారం 'ఎక్స్'లో ఆయన కన్నడ సినిమారంగంలో ప్రముఖ నటుడిగా పేరొంది లక్షలాదిమంది అభిమానపాత్రుడు శంకర్‌నాగ్‌తోపాటు కన్నడిగుల అభిమాన యాంకర్, నటి అపర్ణల పేర్లు మెట్రో స్టేషన్‌లకు పెట్టాలన్నారు. శంకర్‌నాగ్ మృతి చెంది ఏళ్లు ముగిసినా ఇప్పటికే అభిమానించేవారు ఉన్నారన్నారు. వారందరి ఆశయాలకు అనుగుణంగా మెట్రో స్టేషన్లకు పేరు పెట్టాలని కోరారు.


విధానసౌధ

సమగ్రంగా సమాధానాలు ఇవ్వండి

అధికారులకు సీఎం ఆదేశం... అన్నిశాఖల కార్యదర్శులతో కీలక భేటీ

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శాసనసభ, విధానపరిషత్‌లో సభ్యులు లేవనెత్తే అంశాలకు సమగ్ర సమాధానాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆదివారం అధికారిక నివాసం కృష్ణలో ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. చీఫ్ సెక్రటరీ రజనీశ్ గోయెల్, అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు, డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ శాసనసభలో పలు అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉందన్నారు. వాటిలో కొన్ని వివాదాలు లేవనెత్తి ప్రతిపక్షాలు విమర్శలు చేయవచ్చు అన్నారు. ఎటువంటి అంశమైనా ముందస్తుగా అన్నింటికీ సమగ్ర సమాచారంతో సభకు రావాలన్నారు. మంత్రులకు సమగ్ర సమాచారం వెంటనే సమకూర్చేలా సీనియర్ అధికారులు బాధ్యులుగా ఉండాలని ఆదేశించారు. గతంలో జరిగిన చర్చలు, ఆదేశాలను పారదర్శకంగా మంత్రుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో గ్యారెంటీల కార్యక్రమంలో ప్రగతి, బడ్జెట్‌లో ప్రకటించిన పథకాల పనితీరుతోపాటు ప్రతి అంశంపైనా మంత్రులకు సమాచారం అందించాలన్నారు. తప్పుడు సమాచారంతో సభలో అవమానం కలిగేలాంటి వాతావరణం ఏర్పడితే అందుకు సంబంధితశాఖ ముఖ్యులనే బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. తాగునీటి సమస్య, కలుషిత నీరు వంటి తీవ్రమైన అంశాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం అదనపు కార్యదర్శి ఎల్‌కే అతీక్‌తోపాటు సీఎం రాజకీయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


వివిధశాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారుల సమావేశంలో సీఎం సిద్దరామయ్య

నేటి నుంచి సభా సమరం



- ప్రభుత్వంపై పోరుకు సిద్ధమైన ప్రతిపక్షాలు
- పదులసంఖ్యలో అస్త్రాల ప్రయోగం
- బీజేపీ - జేడీఎస్ ఉమ్మడి పోరాటం
- ఎదుర్కొనేందుకు సర్కార్ సన్నద్ధం
- శాసనసభ సమావేశాలకు ఏర్పాట్లు పూర్తి

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్న అవినీతి ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రభుత్వాన్ని శాసనసభ సమావేశాలలో మరింత కట్టడి చేసేందుకు ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ సిద్ధమయ్యాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరుగుతున్న శాసనసభ సమావేశాలలో అధికార పార్టీని ముప్పుతిప్పలు పెట్టేందుకు ప్రతిపక్షాల నేతలు పదులసంఖ్యలో అస్త్రాలను సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం విధానసౌధలో ప్రారంభం కానున్నాయి. 9రోజులపాటు కార్యకలాపాలు జరిపేలా తీర్మానించారు. తొలిరోజు సంతాప తీర్మానాలతోనే శాసనసభ ముగియనుంది. విధానపరిషత్ మాత్రం కొంతసేపు వాయిదా తర్వాత కొనసాగే సంప్రదాయ ఉంది. మంగళవారం నుంచి అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య అసలైన చర్చలు, అవినీతి ఆరోపణల సమరం ప్రారంభం కానుంది. శాసనసభ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీజేపీ, జేడీఎస్ వేర్వేరుగానే కొనసాగాయి. లోక్‌సభ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు మైత్రి ఏర్పాటు చేసుకున్నాయి. ఈ పరిణామంతోనే ఎన్నికల్లో రెండు పార్టీలకు కలసి వచ్చింది. జేడీఎస్ మూడు స్థానాల్లో పోటీ చేయగా రెండింట విజయం సాధించింది. బీజేపీ 17 స్థానాలతో గౌరవాన్ని దక్కించుకుంది. అధికార కాంగ్రెస్ 9 స్థానాలు కైవసం చేసుకుంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ - జేడీఎస్ మైత్రి మరింత బలపడింది. ప్రతి విషయంలోనూ సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీనికితోడు కేంద్రంలో కీలకమైన భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రిగా కుమారస్వామి కొనసాగుతుండడంతో అధిష్ఠానం పెద్దలతో సత్సంబంధాల కారణంగా రాష్ట్ర బీజేపీ నేతలు సఖ్యతతో ఉన్నారు.

ప్రతిపక్షాల అస్త్రాలివే...

వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ. 187 కోట్ల అవినీతి వెలుగులోకి రావడం, ఏకంగా రూ. 94 కోట్లు హైదరాబాద్‌కు చెందిన ప్రాంతీయ బ్యాంకులలోని బినామీ ఖాతాలకు నగదు బదిలీలతో ప్రభుత్వం అడ్డంగా ఇరుక్కుంది. దీంతో నాగేంద్ర మంత్రి పదవిని కోల్పోవడం, రెండు రోజుల ముందు ఏకంగా అరెస్టు కావడం మరో ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లడం ప్రభుత్వానికి ఇబ్బంది పెట్టే అంశాలు. తాజాగా వక్ఫ్‌బోర్డు నిధులు ఎటువంటి అనుమతులు లేకుండానే బెంగళూరు నుంచి చింతామణి బ్యాంకు ఖాతాలకు బదిలీ అయిన విషయమై ఎఫ్ఐఆర్ నమోదైంది. పర్యాటకశాఖలోనూ నగదు బదిలీ అంశం తెరపైకి వచ్చింది. ఇక మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో ఇంటి స్థలాల పంపిణీలో అవినీతిలో నేరుగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య భార్య పేరు ఉండడంతో ఈ అంశంపై తీవ్రస్థాయిలో పోరాటాలకు సిద్ధమవుతున్నారు. మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం, డెంగీతో రాష్ట్ర ప్రజలు అతలాకుతలం కావడం, ఏడో వేతన కమిషన్‌తోపాటు పాత పెన్షన్‌ను అమలు చేయకపోతే నెలాఖరులో సమ్మెకు దిగుతామని ప్రభుత్వ ఉద్యోగులు హెచ్చరికలు ప్రతిపక్షాలకు ప్రధాన అస్త్రాలు అవుతున్నాయి. వీటన్నింటికంటే రామనగర జిల్లాను బెంగళూరు దక్షిణగా పేరు మార్చాలనే ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యూహంపై ప్రతిపక్షాలు ఇప్పటికే మండిపడ్డాయి. సభలోనూ ఈ అంశంపై చర్చకు డిమాండ్ చేసే అవకాశం ఉంది. బడ్జెట్‌లో కేటాయించిన ఎస్సీ, ఎస్టీ నిధులను గ్యారెంటీ పథకాలకు మళ్లించడం సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దళిత సంఘాలు ఈ అంశంలో తీవ్రంగా మండిపడుతున్నాయి. ఇక ప్రాంతాలవారీగా ఎమ్మెల్యేలు, మంత్రులపైనా కొన్ని తీవ్రమైన అంశాలను ప్రస్తావించదలిచారు.

తిప్పికొట్టేందుకు సర్కారు సన్నద్ధం

ప్రతిపక్షాలు లేవనెత్తే ఏ అంశాన్నయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మంత్రులకు సూచించారు. గత గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. ముడా అవినీతి అంశంతోపాటు వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ సహా ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలకు దీటుగా సమాధానం చెప్పాలని సీఎం సూచించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు తమ పరిధిలోని ఎమ్మెల్యేలను కలుపుకొని శాసనసభలో ఎక్కువ సమయం గడపాలని సూచించినట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాలు ఉభయసభల్లో రోజుకో అంశాన్ని ప్రస్తావించే ఆలోచనలో ఉండగా అందుకు మంత్రులు చర్చలకు సిద్ధంగా ఉండాలని సీఎం సూచించారు.

బీజేపీ-జేడీఎస్ అగ్రనేతలు లేని సమావేశాలు

రాష్ట్ర శాసనసభలో దశాబ్దాల కాలం కొనసాగిన బీజేపీ, జేడీఎస్ అగ్రనేతలు లేని శాసనసభ కార్యకలాపాలు తొలిసారి జరుగుతున్నాయి. బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో ఆయన ఏడాదికి ముందే క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. మరో మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్ బెళగావి ఎంపీ అయ్యారు. మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై మూడున్నరేళ్లపాటు పాలన సాగించారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూనే హావేరి నుంచి లోక్‌సభ సభ్యుడయ్యారు. ఇక జేడీఎస్ పక్షనేతగా ఉన్న కుమారస్వామి మండ్య నుంచి ఎంపీగా ఎన్నికై కేంద్రమంత్రి అయ్యారు. పరిషత్ ప్రతిపక్షనేతగా వ్యవహరించిన కోట శ్రీనివాస పూజారి ఉడుపి - దక్షిణకన్నడ ఎంపీ అయ్యారు. ఇలా కీలకనేతలు లేని ప్రతిపక్షం ఈసారి నెలకొంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్ సారథులుగా వ్యవహరించాల్సి వస్తోంది. జేడీఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కుమారస్వామి స్థానాన్ని మరెవరూ భర్తీ చేయలేదు. జేడీఎస్‌లో సీనియర్ నేత జీటీ దేవెగౌడ కీలకనేతగా వ్యవహరించనున్నారు.

తమిళనాడుకు రోజూ 8 వేల క్యూసెక్కులు

అఖిలపక్షం సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం.. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రుల డుమ్మా


అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కావేరి జలాల వివాదంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన ఆదివారం సాయంత్రం విధానసౌధలో అత్యవసర అఖిలపక్ష భేటీ నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ సీనియర్ నేత సదానందగౌడ, జేడీఎస్ పార్టీ నుంచి జీటీ దేవెగౌడ, భోజేగౌడ పాల్గొన్నారు. కావేరి జలాలను తమిళనాడుకు రోజూ ఒక టీఎంసీ విడుదల చేయాలని కావేరి నీటి నియంత్రణా సమితి ఆదేశాలు ఇచ్చింది. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తీవ్రంగా ఆక్షేపించింది. కావేరి జలాల వివాదంపై తరచూ చోటు చేసుకుంటున్న అంశాలను ప్రస్తావించారు. సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ కావేరి నీటి నియంత్రణా మండలి నిర్ణయం సమంజసంగా లేదని అభిప్రాయపడ్డారు. దాదాపు 8 నెలలపాటు కావేరి జలాశయాలలో నీరు లేక బోసిపోయాయని, గత రెండు మూడు వారాలుగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలకు నీరు చేరుతోందన్నారు. అఖిలపక్ష భేటీలో నాయకులందరి అభిప్రాయాలను తీసుకున్నారు. అనంతరం ఒక సమష్టి నిర్ణయానికి వచ్చారు. రోజూ 8వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేయాలని తీర్మానించారు. ఇప్పటికే కావేరి జలాశయాలలోని కబిని, హారంగి జలాశయాలకు సమృద్ధిగా నీరు చేరుతుండడంతో ప్రస్తుతం 8 వేల క్యూసెక్కులకంటే ఎక్కువగా నీరు విడుదల అవుతోంది. అఖిలపక్ష భేటీకి మంత్రులు పరమేశ్వర్, మునియప్ప, మహదేవప్ప, రామలింగారెడ్డి, చలువరాయస్వామి, రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రుల డుమ్మా

రాష్ట్రానికి జీవనాడిగా ఉన్న కావేరి నది నుంచి తమిళనాడుకు రోజూ ఒక టీఎంసీ విడుదల చేయాలన్న కావేరి నీటిని యంత్రణా మండలి సూచనపై సీఎం సిద్దరామయ్య పిలుపుతో అఖిలపక్ష భేటీ నిర్వహించగా రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రులు డుమ్మా కొట్టారు. కావేరి నదికి కీలకమైన మండ్య ప్రాంత ఎంపీగా, కేంద్రంలో కీలకమంత్రిగా ఉన్న కుమారస్వామి హాజరు కాలేదు. బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ మంజునాథ్ కూడా అఖిలపక్ష సమావేశంలో పాల్గొనలేదు. కేంద్రమంత్రులు ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె, సోమణ్ణ సైతం సమావేశానికి దూరంగా ఉన్నారు. కేంద్రమంత్రులు పాల్గొని ఉంటే అఖిలపక్ష సభకు మరింత శోభ ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.



ఇక బస్సు చార్జీల మోత

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శక్తి గ్యారెంటీ అమలులోకి వచ్చి ఏడాది అవుతోంది. మహిళలు శక్తి గ్యారెంటీ ద్వారా ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. పథకం ప్రారంభించినా ఆర్టీసీ సంస్థలకు నష్టం లేదని చెప్పుకొంటూ వచ్చిన పాలకులు, అధికారులు రాష్ట్ర ప్రజలపై మోత మోగించేందుకు సిద్ధమయ్యారు. త్వరలోనే బస్సు చార్జీలు పెంచనున్నట్లు కేఎస్ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ఆర్ శ్రీనివాస్, వాయువ్య విభాగం సంస్థ చైర్మన్ రాజు కాగె వెల్లడించారు. ఆదివారం వారు వేర్వేరు ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడుతూ డీజిల్ ధరలు పెరిగాయని బస్సు చార్జీలు పెంచడం అనివార్యమవుతోందన్నారు. 15-20 శాతం టిక్కెట్ చార్జీలు పెంచేందుకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. గత త్రైమాసికంలో కేఎస్ఆర్టీసీకి రూ. 295 కోట్ల నష్టం వచ్చిందని, 40 కొత్త ఓల్వో బస్సుల కొనుగోలుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఇప్పటికే 600 సాధారణ బస్సులను కొనుగోలు చేశామన్నారు. ఆర్టీసీ సంస్థ మనుగడ సాధించాలంటే బస్సు చార్జీల పెంపు అనివార్యమన్నారు. బెళగావిలో వాయువ్య ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్ రాజు కాగె మీడియాతో మాట్లాడుతూ సంస్థ నష్టాల్లో ఉందన్నారు. డీజిల్ ధరల పెంపు, విడిభాగాల ధరలు పెరిగాయని చార్జీలు పెంచకుంటే నిర్వహణ కష్టం కానుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ 2020లో జరగాల్సి ఉండేదని పెండింగ్‌లో ఉందన్నారు. అన్ని విధాలా ఆర్టీసీ మనుగడ సాధించాలంటే చార్జీల పెంపు ఒక్కటే పరిష్కారమన్నారు.



వక్ఫ్ బోర్డులో రూ. 8 కోట్ల బదిలీ

చీఫ్ అకౌంటెంట్ ఫిర్యాదు.. మాజీ సీఈఓపై కేసు

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి)

వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాదిరూపాయల అవినీతి అంశం తారస్థాయికి చేరి ఏకంగా మంత్రి పదవిని కోల్పోయిన కాంగ్రెస్ ఎమ్మెల్యే నాగేంద్ర అరెస్టు అయ్యారు. మరో ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ కుటుంబీకులతోపాటు అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇలా సాగుతుండగానే మరో కార్పొరేషన్‌లో అవినీతి బహిర్గతమైంది. రాష్ట్ర వక్ఫ్‌బోర్డులో కోట్లాది రూపాయల అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. వక్ఫ్‌బోర్డు మాజీ సీఈఓ జుల్ఫి కరుల్లాపై కోట్లాది రూపాయలు డీల్ చేశారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. వక్ఫ్‌బోర్డు ఖాతా నుంచి విడతల వారీగా రూ.8కోట్లను నగదు బదిలీ చేశారని హైగ్రౌండ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అక్రమంగా నగదు బదిలీకి సంబంధించి వక్ఫ్‌బోర్డు చీఫ్ అకౌంటెంట్ మీర్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైగ్రౌండ్ పోలీసులు కేసు నమోదు చేశారు. బెంగళూరు నుంచి చింతామణి అకౌంట్‌కు నగదు బదిలీ చేసిన మేరకు పోలీసులు విచారణ ప్రారంభించారు. కర్ణాటక వక్ఫ్‌బోర్డు కలబురగి దర్గాకు చెందిన ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇందుకు కార్పొరేషన్‌కు రూ. 2.29 కోట్లు కేటాయించింది. వక్ఫ్‌మండలిలో దేవదాయశాఖ నుంచి రూ. 1.79 కోట్ల గ్రాంట్లు వచ్చాయి. రెండూ కలిపి రూ.4 కోట్లు బెన్సన్‌టౌన్ ఇండియన్‌బ్యాంకు ఎస్‌బీ ఖాతాలో జమ చేశారు. 2016 నవంబరు 26న వక్ఫ్‌బోర్డు ఖాతా నుంచి రూ.4 కోట్లను అప్పటి సీఈఓ జుల్ఫికరుల్లా చింతామణి విజయాబ్యాంకుకు రెండు చెక్కుల రూపంలో బదిలీ చేసి డిపాజిట్ చేశారు. తద్వారా సంస్థకు రూ.8 కోట్ల నష్టం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.


కబిని డ్యామ్ నుంచి నీటి విడుదలతున్న జలాలు

కబిని నుంచి ఒకేరోజు 20వేల క్యూసెక్కులు


బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి)

కేరళ రాష్ట్రం వయనాడు ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కావేరి నదికి అనుబంధమైన కబిని జలాశయం దాదాపు భర్తీ దశకు చేరింది. దీంతో కబిని నుంచి తమిళనాడుకు ఆదివారం ఒక్కరోజే 20వేల క్యూసెక్కులను విడుదల చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షితంవైపు వెళ్లాలని నీటిపారుదలశాఖ అధికారులు ఆదివారం ప్రకటించారు. జలాశయానికి 19,181 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంది. గరిష్ఠ నీటిమట్టం 2,284 అడుగులు కాగా ప్రస్తుతానికి 2,283.3 అడుగులకు చేరింది. టీఎంసీల ప్రకారమైతే 19.52 సామర్థ్యం కాగా ప్రస్తుతం 19.06 టీఎంసీల నీరు ఉంది. బీచనహళ్లిలోని కబిని జలాశయానికి నీరు చేరే ప్రాంతంలో బ్రిడ్జ్ మునిగిపోవడంతో కిందివైపు వదులుతున్నారు. మైసూరు, చామరాజనగర జిల్లాల చెరువులకు నీటిని మళ్లించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. కబిని జలాశయం పరిధిలో భారీగా వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టు సురక్షిత దృష్ట్యా నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీలు ఇక ప్రభుత్వ మాంటిస్సోరీలు

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ అనేది ఐదు దశాబ్దాల నాటి పరికల్పన అని, ఇకపై ప్రభుత్వ మాంటిస్సోరీలుగా మారుస్తున్నట్లు స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ తెలిపారు. ఆదివారం బెంగళూరులోని మడివాలలో స్త్రీశక్తిభవన్‌ను సందర్శించి అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈనెల 22న రాష్ట్రంలోని 250 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీలను సాంకేతికంగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. తొలివిడతలో 15-20వేల మంది పిల్లల కోసం మాంటిస్సోరీలకు శ్రీకారం చుడతామని, తర్వాత అంచెలంచెలుగా రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సౌలభ్యాలు పెంచుతామన్నారు. 30 ఏళ్ల పైబడిన కేంద్రాలను ఉన్నతీకరణ అమలు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు బీమా తీసుకొచ్చే అంశం పరిశీలిస్తున్నామన్నారు. సమాజానికి అంగన్‌వాడీల సేవలు అపారమైనవని కొనియాడారు. బాల్యంలోనే గుణాత్మకమైన శిక్షణకు శ్రీకారం చుట్టాలనేది తమ ఆశయమన్నారు.


మడివాళలోని స్త్రీశక్తిభవన్‌ను పరిశీలిస్తున్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1605.28	1,584.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	21,643	17,383
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	205	266
సామర్థ్యం (టీఎంసీలు)	29.16	6.89

ఇరకాటంలో మాజీ మంత్రి

● అక్రమాల కేసుల్లో ఇరుక్కున్న నాగేంద్ర ● గతంలో సీబీఐ.. ఇప్పుడు ఈడీ చేతిలో కస్టడీకి..



బళ్లారి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే, నాగేంద్ర అక్రమాల కేసుల్లో కూరుకుపోయారు. 2013లో ఇదే సిద్దరామయ్య సీఎంగా ఉన్న కాలంలో నాగేంద్రను అక్రమంగా ఇనుప ముడిఖనిజం విదేశాలకు రవాణా చేసిన కేసులో సీబీఐ అరెస్టు చేసింది. ఇప్పుడు మళ్లీ సిద్దూ హయాంలోనే వాల్మీకీ నిగమమండలి ఖాతాలో నుంచి రూ. 187 కోట్లు నిధులు ఇతర ఖాతాలకు తరలింపు కేసులో ఈడీ అదుపులోకి తీసుకుంది.

2013లో జేడీఎస్ కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉండేది. అప్పుడు నాగేంద్ర కూడ్లిగి నుండి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇనుప ముడిఖనిజం విదేశాలకు రవాణా చేసిన కేసులో సీబీఐ అధికారులు అరెస్టుచేయగా, ఏడాది పాటు బెంగళూరులోని పరప్పన హళ్లి జైల్లో ఉన్నారు.

2018లో కాంగ్రెస్ నుంచి పోటీ

2018 వరకూ గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు, బి. నాగేంద్ర ముగ్గురూ కలిసే ఉండేవారు. ఆ సమయంలో గనుల దోపిడీపై సీఎం సిద్దరామయ్య బెంగళూరు నుండి బళ్లారికి కాంగ్రెస్ పార్టీ తరుపున పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ నాయకుల నేతృత్వంలో బి. నాగేంద్ర కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరి గెలిచిన ఆనంద్‌సింగ్ తిరిగి బీజేపీలో చేరిపోయారు. కానీ నాగేంద్ర అలాగే పార్టీలో ఉండిపోయారు. ఈసారి కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా ఉన్న నాగేంద్ర తన శాఖలోనే ఏకంగా రూ.187 కోట్ల నిధులు ఇతర ఖాతాల్లోకి తరలింపు కేసులో ఇరుకున్నారు. దీనిపై ఈడీ, సీబీఐ, సిట్ సంస్థలు విచారణ చేస్తున్నాయి. శనివారం మాజీ మంత్రి. బి నాగేంద్రను ఈడీ విచారణ పేరుతో అదుపులోకి తీసుకుంది. ఆయనతో పాటు మరో 20 మంది ఇళ్లలోనూ సోదాలు చేసింది. అప్పట్లో అక్రమ గనుల కేసులో ఏకంగా ఏడాది పాటు జైల్లో గడిపిన ఆయన మరి ఇప్పుడు ఈ కేసు నుండి బయట పడతారా..? లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. వాల్మీకీ నిగమ మండలి ఖాతా నుంచి రూ. కోట్లు నిధులు దుర్వినియోగంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చసాగుతోంది. ప్రతిపక్ష పార్టీ కూడా ఇదేవిషయంపై రచ్చరచ్చ చేస్తోంది. ఏకంగా సిద్దరామయ్యనే రాజీనామా చేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. ఈ అవినీతి వ్యవహారంలో నాగేంద్ర వల్ల సీఎం కూడా సందిగ్ధంలో పడ్డారు.

వేగం పుంజుకున్న ఈడీ విచారణ

●రాయచూరు రూరల్ ఎమ్మెల్యేకు ఇప్పటికే నోటీసులు ●భూమి అమ్మిన వారికిసైతం ఈడీ తాఖీదులు

రాయచూరు, జూలై 14 : కర్ణాటక వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన రూ.187 కోట్ల అవినీతికి సంబందించి ఈడీ అధికారులు చేపట్టిన విచారణ వేగం పుంజుకుంది. ఇప్పటికే జిల్లాకు చేరుకున్న ఈడీ అధికారులు వాల్మీకి మండలి అధ్యక్షుడైన రాయచూరు రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ నివాసంలో సోదాలు నిర్వహించి ఆయనకున్న ఆస్తులపై దృష్టి సారించారు. ఈ క్రమంలో ఆయన తన భార్య ఊరు గలగ్‌లో కొంతమంది బినామీ వ్యక్తులపేర్లపై భూమి కొనుగోలు చేసినట్లు వచ్చిన ఆరోపణల మేరకు ఈడీ అధికారులు వాటిపై దృష్టి సారించారు. కాగా దద్దల బసనగౌడకు నగర సమీపంలోని ఆశాపూర్ రోడ్డులో నాల్గు ఎకరాలు భూమిని అమ్మిన రైతులకు సహితం ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 18న విచారణకు హాజరుకావాలని సూచించగా వారు విచారణ పేరుతో భయభ్రాంతలకు గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై భూమి విక్రయించిన రైతులను మీడియా ప్రశ్నించగా అనవసరంగా తాము ఈకేసులో ఇరుక్కున్నామంటూ కన్నీటి పర్యంతం కావడం గమనార్హం. కాగా మాజీ మంత్రి నాగేంద్రను అదుపులోకి తీసుకున్న విచారణ అధికారులు తదుపరి విచారణను కార్పొరేషన్ అధ్యక్షుడిగా ఉన్న రూరల్ ఎమ్మెల్యేపై ఫోకస్ చేయడంతో ఆయన హాజరవుతారా..? లేదా అన్నదానిపై సందేహం మొదలైంది. ఆయన ఆదివారం నగరం నుంచి మంత్రాలయం రోడ్డువైపు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు.



కారులో మంత్రాలయం వైపు వెళుతున్న ఎమ్మెల్యేదద్దల బసనగౌడ

పంపుసెట్ల కింద జోరుగా వరి నాట్లు

కంప్లి, జూలై 14 : తుంగభద్ర నది ఒడ్డున ఉన్న గ్రామాల్లో బోర్ల కింద వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. జలాశయంలో రోజురోజుకు నీటి మట్టం పెరుగుతుండటంతో నది ఒడ్డున ఉన్న బెళగోడుహాళ్, సన్నాపురం, నారాయణ స్వామి క్యాంపు, బసవేశ్వర క్యాంపు, మారెమ్మ క్యాంపు, ఇటిగి, మన్నూరు, సూగూరు గ్రామాల్లో వరినాట్లు జోరందుకున్నాయి. నదిలో కొద్ది వరకు నీరు రావడంతో బోర్లలో నీరు పుష్కలంగా చేరింది. రైతన్నలు ముందుగానే పొలంలో వేసుకున్న నారుమళ్లు సిద్ధం కావడంతో వాటిని తమ పొలాల్లో నాటేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా అచ్యుతరాయవర్మ మాట్లాడుతూ, ఈ యేడాది బోర్లలో నీరు పుష్కలంగా రావడంతో దాంతో నాట్లు ప్రారంభించామన్నారు. ఎల్ఎల్‌సీ కాలువకు నీరు రాక ముందే ఈ యేడాది నాట్లు వేసుకునేందుకు సిద్ధమయ్యామని తెలిపారు. అలాగే కాలువ కింద వున్న రైతన్నలు బోర్ల కింద ఏపుగా నార్ల పెంపకం చేపడుతున్నారు.



సన్నాపురంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

పెరుగుతున్న అనధికార భవనాలు

● కార్పొరేషన్‌కు పన్ను ఎగవేత ● పరిశ్రమలకయితే పట్టపగ్గాల్లేవు ..

బళ్లారి సిటీ, జూలై 14: బళ్లారి మహానగరం రోజురోజుకు విస్తరిస్తోంది. భారీ భవనాలు, వాణిజ్య దుకాణాలు, పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అందులో అధికారికంగా ఉండే వాటి కంటే అనధికార భవనాల సంఖ్యే ఎక్కువ. జిల్లా కేంద్రంగా ఉన్న మహానగర కార్పొరేషన్ పరిధిలో 39వార్డులు ఉన్నాయి.



ఈ వార్డులన్నింటిలో అనధికార నిర్మాణాల సంఖ్య రెట్టింపు కావడం ఆందోళన కలిగిస్తోంది. నగరంలో 62,413 నివాస భవనాలు, 10,478 వాణిజ్య, 83 పారిశ్రామిక భవనాలు, 21,915 ఖాళీస్థలాలు ఉన్నట్లు కార్పొరేషన్ గుర్తించింది. వీటిలో అధికారిక సంఖ్య కంటే అనధికారికంగా నిర్మించినవే ఎక్కువ. అక్రమ పరిశ్రమల సంఖ్య 83 కాగా అనధికార పరిశ్రమల సంఖ్య 265. ఇన్ని లెక్కలు చెప్పిన మున్సిపల్ కార్పొరేషన్ వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదనేది చర్చకు తావిస్తోంది.

కార్పొరేషన్ పన్నుకు గండి

నగర అభివృద్ధికి ప్రాథమిక ఆధారం కార్పొరేషన్ వసూలు చేసే పన్ను. ప్రభుత్వ గ్రాంట్లతోపాటు పన్నుల ద్వారా వచ్చే సొమ్ము అభివృద్ధికి తోడ్పడుతుంది. అయితే బళ్లారి నగరంలో అనధికార నివాస, వాణిజ్య, పారిశ్రామిక, ఖాళీ ప్లాట్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో కా ర్పొరేషన్ పన్నుల వసూళ్లపైనా దాని ప్రభావం పడుతోంది. చివరకు పన్నుచెల్లించేవారికంటే ఎగ్గొట్టేవారి సంఖ్యే ఎక్కువవుతోంది. దీంతో నిధులు లేక కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయి. అంతేకాకుండా నిజాయితీ పరులైన పన్నుచెల్లింపుదారులలో మనం ఎందుకు పన్ను చెల్లించాలనే అభిప్రాయం కూడా బలపడుతుంది. కార్పొరేషన్ పన్నుల వసూళ్లకు ముందుకొస్తే నగర అభివృద్ధికి స్థానిక వనరులు సమకూరుతాయి. ఈ విషయంలో కార్పొరేషన్ శ్రద్ధ వహించాలన్నది పౌరుల కోరిక.

ఇళ్లలో నూనె తాగుతున్న ఎలుగుబంటి పట్టివేత



అటవీ సిబ్బందికి పట్టుబడిన ఎలుగుబంటి

బళ్లారి సిటీ,జూలై 14: గ్రామంలోని ఇళ్లలో నిల్వ ఉంచిన నూనె తాగుతున్న ఎలుగుబంటి ఎట్టకేలకు అటవీ సిబ్బందికి పట్టుబడింది. మూడు నాలుగు రోజులుగా సందూరు తాలూకా తోణసగెరె గ్రామస్థులపై ఈ ఎలుగుబంటి దాడి చేస్తోంది. గ్రామంలోని ఇళ్లలోకి ప్రవేశించి అక్కడ ఉంచిన వంటనూనెను తాగి సామాన్లను చెల్లాచెదురు చేస్తున్నట్లు అటవీశాఖకు ఫిర్యాదులు అందాయి. అటవీశాఖ అధికారులు వెతికినా ఎలుగుబంటి కనిపించలేదు. ఆదివారం ఉదయం గ్రామంలోని గంగమ్మ హోటల్లో దూరి సామాన్లను చెల్లచెదురు చేస్తుండగా ప్రజలు కేకలు వేయడంతో దగ్గర్లలోని పాఠశాల్లోకి దూరింది. అనంతరం అటవీశాఖ అధికారులు వచ్చి గ్రామస్థుల సహకారంతో ఎలుగుబంటిని పట్టుకున్నారు. ఎలుగబంటి కాలికి తీవ్ర గాయం కావడంతో అడవిలో ఆహారం దొరక్క గ్రామంలోకి ప్రవేశించినట్టు తెలుస్తోంది. దానిని కమలాపూర్‌కు తరలించి చికిత్స అందించి ఉన్నతాధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని డీఆర్ఎఫ్ఓ జడియప్ప తెలిపారు.

లిటిగేషన్ల సంఖ్య తగ్గించాలి



సమస్యలను పరిష్కరిస్తున్న న్యాయాధికారులు

బళ్లారి సిటీ, జూలై 14: ఆరోగ్యవంతమైన సమాజం కావాలంటే లిటిగేషన్ల సంఖ్య తగ్గించాలని జిల్లాలీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ శాంతి అన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించామని, ఈ అదాలత్‌లో మొత్తం 31 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. శనివారం నగరంలోని కొత్త జిల్లా కోర్టు సముదాయంలోని వీడియో హాల్లో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె ప్రసంగించారు. చిన్నచిన్న కేసులకు కూడా ప్రజలు కోర్టు తలుపు తడుతున్నారని ఇది మంచిది కాదన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌లలో పాల్గొని పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న 16,284 కేసులను రాజీ కుదిర్చేందుకు గుర్తించామని, వాటిలో 11,902 కేసులను రాజీద్వారా పరిష్కరించామన్నారు. కుటుంబ న్యాయస్థానంలో లోక్ అదాలత్ బెంచ్ ముందు ఆరు జంటలు విజయవంతంగా రాజీపడ్డాయన్నారు. కార్యక్రమంలో జిల్లాలీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ రాజేశ్‌హొసమనె పాల్గొన్నారు.

కళాకారులకు జన్మనిచ్చే జిల్లా బళ్లారి

బళ్లారి సిటీ, జూలై 14:కళాకారులకు జన్మనిచ్చే జిల్లా బళ్లారి అని నాడోజ అవార్డు గ్రహీతలు వి.టి.కాళి అభిప్రాయపడ్డారు. నగరంలోని డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో ఆదివారం రాజ్యోత్సవ అవార్డు గ్రహీతలకు సన్మానం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 70సంవత్సరాల క్రితం జిల్లాలో 50 మందికి పైగా కళాకారులు ప్రసిద్ధి చెందారని, జిల్లా నాటకం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, తోలుబొమ్మలాట వంటి కళారూపాలకు ప్రసిద్ధి చెందిందన్నారు. బళ్లారి రాఘవ, సిరిగేరి నాగనగౌడ, సుభద్రమ్మ, బెళగల్లు వీరన్న, బళ్లారి లలితమ్మ తదితరులు కళారంగానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. సంఘటిత పోరాటంద్వారా ప్రభుత్వ సౌకర్యాలను పొందగలమని, ఒకరిపై మరొకరు ద్వేషం లేకుండా ఐపీఎల్ టీమ్‌లాగా సంఘీభావం తెలపడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో బళ్లారి రాఘవ మెమోరియల్ అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు చెన్నప్ప, మల్లికార్జునగౌడ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శివాజీరావు, కన్నడ సాంస్కృతికశాఖ సహాయక సంచాలకులు నాగరాజ్, రిటైర్డ్ డిప్యూటీడైరెక్టర్ చోనసూర్ కొట్రప్ప తదితరులు పాల్గొన్నారు.

కుడితినిలో ఆకట్టుకుంటున్న రోడ్లు



కుడితిని బస్టాండు వద్ద విస్తరణ పూర్తయిన రోడ్డు

కంప్లి, జూలై 14 : జిల్లా పరిధిలో కర్మాగారాల పట్టణంగా పేరొందిన కుడితిని పట్టణంలో రోడ్డు మరమ్మతు పనులు పూర్తి కావడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎస్‌హెచ్ 63 రోడ్డు మార్గం ఇరుకుగా వుండడమే కాకుండా రోడ్డు మధ్యలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అప్పట్లో సందూరు ఎమ్మెల్యేగా వున్న తుకారామ్ రోడ్ల మరమ్మత్తులపై స్పందించి రూ.32 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో రోడ్డు అభివృద్ధి పూర్తి కావడంతో ప్రయాణికులు ఆనందిస్తున్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ.. గతంలో కుడితిని పట్టణం అంటే ఎంతో మందికి విసుగు ఉండేదని, ఇప్పుడు పూర్తిగా అభివృద్ధి చెంది ప్రయాణికులను, స్థానికులను పూర్తిగా ఆకట్టుకుంటోందన్నారు.

గ్రామాల్లో మొహర్రం సంబరాలు



కంప్లి, జూలై 14: గ్రామాల్లో మొహర్రం పండుగ సంబరాలు కనిపిస్తున్నాయి. పండుగ రాగానే చిన్నారుల నుంచి పెద్దల వరకు నృత్యాలు చేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కంప్లి, కురుగోడు, కుడితిని గ్రామాల్లో సంబరాలు జోరందుకున్నాయి. అలాగే ఆదివారం పులివేషాలు ఆడుతూ కళాకారులు గ్రామాల్లో ఆకట్టుకుంటున్నారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. మొత్తానికి అన్ని గ్రామాల్లో మొహర్రం సంబరాలు కనిపిస్తున్నాయి. కంప్లి పట్టణంలో ఎదురు మసీదు వద్ద పీర్లకు వెండి ఆభరణాలతో కూడా మొక్కులు సమర్పించుకున్నారు.

కొలువుదీరిన పీర్లు

బళ్లారిరూరల్, జూలై 14 : బళ్లారి నగరంతో పాటు మోకా రూపనగుడి, పీడీ హళ్లి, అసొండి తదితర గ్రామాల్లో మొహర్రం పండుగ సందర్భంగా ఆదివారం పీర్ల చావిడిలలో పీర్లు కొలువుదీరాయి. గ్రామాల్లో పెద్దఎత్తున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామివారికి చక్కెర చదివింపులు నిర్వహించారు.



మోకాలో అలాయి గుంత తీస్తున్న యువకులు

గ్రామీణాభివృద్ధి సంస్థను సద్వినియోగం చేసుకోండి

కంప్లి, జూలై 14: గ్రామాలలో పేద ప్రజలకు ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఇచ్చే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కురుగోడు సీఐ విశ్వనాథ్ హిరేగౌడ సూచించారు. కురుగోడు పట్టణంలో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో మద్యపానానికి బానిసలైన వారికి మద్యపానం నుంచి విముక్తులయ్యేందుకు చికిత్స ఇవ్వనున్నట్లు తెలిపారు. అందరూ మద్యపానానికి మాదక ద్రవ్యాలకు దూరంగా వుండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రాజేష్, ఆరోగ్య అధికారి ఈరణ్ణ, విరుపాక్షప్ప, హాలప్ప, నాగేష్, దివాకర్ పూజారి, శ్వేత, షణ్ముఖ, పంపాపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి భూమిపూజ



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప, జూలై 14 : రెండు నూతన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణంకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు శంకుస్థాపన చేశారు. ఆదివారం తాలుకాలోని టెక్కలకోట, దేవి నగర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ రెండు చోట్ల చాలా యేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు లేక పిల్లలు చాలా ఇబ్బందులు పడేవారని తెలిపారు. రెవెన్యూశాఖ స్థలం కేటాయించడంతో ఆప్రాంతంలో భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున బాలప్ప, నరేంద్రసింహ, పరమేష, శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోసూరు జోన్

కల్యాణకామాక్షీ అమ్మవారికి చిన్నారుల అభిషేకం



కల్యాణకామాక్షి అమ్మవారికి అభిషేకం చేస్తున్న పిల్లలు

హోసూరు, జూలై 14 : హోసూరు శ్రీ కల్యాణకామాక్షీ అమ్మ వారికి ఆదివారం చిన్నారులు అభిషేకం నిర్వహించారు. హోసూరు భారతీదాసన్ నగర్‌లోని ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం అమ్మవారికి పిల్లలచేత అభిషేకం నిర్వహిస్తారు. అంతకుముందు జరిగిన ఆయుష్య హోమంలో పెద్ద సంఖ్యల్లో పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు కామాక్షి అమ్మకు పాలు, కుంకుమ, పెరుగు, పసుపు, పంచామృతంతో అభిషేకం చేశారు. అభిషేకసేవలో పాల్గొన్న పిల్లలకు మంచి జీవితం, వివేకం, శ్రేష్టమైన విద్య లభిస్తాయని విశ్వాసం. సంతానం కోరుకునే వారు, వివాహం కాని వారు కూడా ఇక్కడ ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహిస్తారు.

అన్నై నగర్ రైల్వే బ్రిడ్జి పనులు పూర్తిచేయాలి

హోసూరు, జూలై 14: హోసూరు అన్నై నగర్ సమీపంలోని అండర్‌పాస్ రైల్వే వంతెన విస్తరణ పనులు 21 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పి ఇంకా పూర్తి చేయలేదని, అదేవిధంగా హోసూరు డెంకణీకోట రోడ్డుల్లో రైల్వే బ్రిడ్జి పనులు ఏడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి ఏడాది గడిచినా పూర్తి కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సబ్‌కలెక్టర్‌కు, రైల్వే పాలకమండలికి వినతిపత్రం సమర్పించినా పనులు పూర్తి కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

విమానాశ్రయం ఏర్పాటుపై ఆర్డినెన్స్ జారీ

మైక్రో ఇండస్ట్రియల్ అసోసియేషన్ అభినందన

హోసూరు, జూలై 14: రెండు వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు ఆర్డినెన్స్ జారీ చేసినందుకు తమిళనాడు ప్రభుత్వానికి హోసూరు మైక్రో ఇండస్ట్రియల్ అసోసియేషన్ అభినందనలు తెలియజేసింది. అసోసియేషన్ ఏడవ జనరల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి మురుగేశన్ అధ్యక్షత వహించగా, సెక్రటరీ రజనీకాంత్ అందరికి స్వాగతం పలికారు. కోశాధికారి వెంకటేశం, మునుస్వామి, కార్యవర్గ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ఉప కార్యదర్శి కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిప్‌కాట్ 3లో మైక్రో పరిశ్రమల కోసం వీలైనంత త్వరగా మెట్రో రైలు రావాలని కోరుతున్నామన్నారు. అలాగే చిన్నచిన్న పరిశ్రమలకు 10 సెంట్ల వరకు స్థలాలను కేటాయించాలని, ఎట్టి పరిస్థితిల్లోను కర్మాగారాలు నష్టపోకుండా చూడాలని కోరారు. బ్యాంకు రుణాలు పొందేందుకు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రభుత్వం కూలి కార్మికులకు రేషన్ ఇవ్వాలని, పేద కుటుంబాల వారి జరిపించాలని కోరారు.



సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు

ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

● పక్కదారి పడుతున్న పారిశుధ్య నిధులు ● డెంగీ, మలేరియా విజృంభణ

బళ్లారి, జూలై 14(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు బుసలుకొడుతున్నాయి. డెంగ్యూ, మలేరియా వ్యాధులతో జనం మంచం పట్టారు. ఇంతకు ముందు కోవిడ్‌లో ఆర్థికంగా దెబ్బతిన్న జనం ఇప్పుడు అంటువ్యాధులతో మరింత ఆర్థికంగా చతికిలపడుతున్నారు. వ్యాధుల నివారణకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా అవి ప్రజల వినియోగంలోకి రావడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రోగాల నివారణకు నగరపాలికె, పట్టణపంచాయితీలు, గ్రామపంచాయితీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. వెరసి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

బళ్లారి, విజయనగర, రాయచూరు, కొప్పళ, చిత్రదుర్గం జిల్లాల్లో డెంగ్యూ, మలేరియా వ్యాధులు తీవ్రంగా పెరిగాయి. ఇప్పటి వరకూ బళ్లారి జిల్లాలో 98 వరకూ డెంగీ లక్షణాలున్న వారు ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. వారిలో 24 మంది డెంగీ సోకి ఆసుపత్రిలో వైద్యం పొందారు. విజయనగర జిల్లాలో 52 మందికి డెంగీ సోకింది. రాయచూరులో 23 మందికి, కొప్పల్లో 18 మందికి, చిత్రదుర్గంలో 17 మందికి డెంగీ సోకిందని వైద్యఆరోగ్యశాఖ రికార్డుల ద్వారా తెలుస్తోంది. ఇవి కేవలం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి వైద్యం పొందినవారి రికార్డులు మాత్రమే. ప్రైవేటు క్లినిక్స్‌లో చేరిన వారు మరెంతో మంది ఉన్నారు.

గనుల ప్రాంతం అయిన సండూరు, తోరణగల్లు, ప్రాంతంలో వర్షాకాలంలో నీటి గుంటలు పెరిగి అవి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. దీంతో డెంగీ, మలేరియా వ్యాధులు పెరిగిపోయాయి. చిన్నపిల్లలకు కూడా మలేరియా సోకి తీవ్రఇబ్బంది పడుతున్నారు. విజయనగర (హొస్పేట్) నగరంలో కొన్ని కాలనీల్లో నీరు చేరిపోయి ముందుకు పారడం లేదు. దీంతో దోమలు ఎక్కువగా ప్రబలి తుంగభద్రడ్యాం వద్దనున్న చేపలకాలనీ, వంకాయ కాలనీ, వాల్మీకి కాలనీ, తదితర కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయితీ, నగర పాలికె, పట్టణపంచాయితీలకు కేటాయిస్తున్న పారిశుధ్యనిధులను పాలకులు డ్రా చేసుకుంటున్నారే కానీ పనులు చేయడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సమష్టికృషితోనే మొక్కల సంరక్షణ సాధ్యం

రాయచూరు, జూలై 14: ప్రజల సమష్టికృషి సామూహిక పరస్పర సహకారంతోనే పచ్చదనాన్ని కాపాడుకోవడం సాధ్యమని నగరసభ సీనియర్ సభ్యుడు జయణ్ణ అన్నారు. పచ్చదనం పరిశుభ్రతను ప్రతిఒక్కరు బాధ్యతగా గుర్తించి మొక్కలు నాటి వాటిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఆదివారం నగరంలోని పవన్ లేఔట్‌లో గ్రీన్ హిల్స్ రాయచూరు, హసిరు బళగ, అటవి శాఖ, నగరసభ ఆధ్వర్యంలో సస్య సంరక్షణ నామకరణ ఉత్సవంలో పాల్గొని జయణ్ణ మాట్లాడారు. తాము మూడేళ్ల క్రితం నాటిన మొక్కలు నేడు పెద్దవిగా ఎదగి పచ్చదాన్ని పంచుతుండడాన్ని ఆనందంగా ఆస్వాదిస్తున్నట్లు ఈ సందర్భంగా జయణ్ణ అన్నారు.



చెట్లకు నేమ్ ప్లేట్లు అతికిస్తున్న జయణ్ణ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కె. కామరాజ్ (జయంతి)



భారత రాజకీయాల్లో కింగ్ మేకర్‌గా పేరొందిన కుమారస్వామి కామరాజ్ నాడార్ 1903 జూలై 15 తమిళనాడు రాష్ట్రం విరుదు నగర్‌లో జన్మించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించి ఇందిరా గాంధీని ప్రధానమంత్రి చేయడంలో కీలకపాత్ర పోషించారు. కల్లుగీత కుటుంబంలో జన్మించిన ఆయన ప్రజాసంక్షేమం కోసం పోరాటాలు చేస్తూ పెళ్లి కూడా చేసుకోలేదు. నారాయణ గురు ప్రభావం ఆయనపై ఉం డేది. ఎమ్మెల్యేగా, ఎంపీగా, ముఖ్యమంత్రిగా ఉన్నత హోదాలు అలంకరించారు. పాఠశాలలో ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి లక్షలాదిమందికి విద్యకు చేరువ చేశారు. 1975 అక్టోబరు 2న కన్నుమూశారు. ఆయన సేవలను గుర్తిస్తూ మరణానంతరం 'భారతరత్న' ప్రకటించారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ (జయంతి)



పద్మవిభూషణ్ గ్రహీత స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశ్‌ముఖ్ 1909 జూలై 15న తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్ర వరం (రాజమండ్రి)లో జన్మించారు. రచయిత్రిగా, న్యాయవాదిగా, సామాజిక కార్య కర్తగాను సమాజంకోసం ఎంతో పాటు పడ్డారు. చెన్నై, హైదరాబాద్‌లలో ఉన్న ఆంధ్ర మహిళా సభలను ఈవిడే స్థాపించారు. ప్రణాళికా సంఘం సభ్యురాలిగా ఉన్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్‌కు తొలి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. 1975లో పద్మ విభూషణ్ పురస్కారం అందుకోగా అదే సంవత్సరం ఆమె భర్త సీడీ దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొం దడం విశేషం. వయోజన విద్యాసేవలకు నెహ్రూ లిట రసీ అవార్డు, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 1981 మే 9న కన్నుమూశారు.

డాక్టర్ కేఎల్ రావు (జయంతి)



పద్మవిభూషణ్ గ్రహీత డాక్టర్ కానూరి లక్ష్మణరావు 1902 జూలై 15న కృష్ణా జిల్లా విజయవాడ ప్రాంతం కంకిపాడు గ్రామంలో జన్మించారు. ప్రముఖ ఇంజనీరు, రాజకీయ నాయకుడు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు సాకారం కావడానికి ఎంతో కృషి చేశారు. విజయవాడ ఎంపీగా 1962 నుంచి 1977 వర కు మూడుసార్లు గెలుపొందారు. నెహ్రూ, లాల్ బహదూర్‌శాస్త్రి, ఇందిరాగాంధీ మంత్రి వర్గాలలో నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. తొలి నాలుగు పంచవర్ష ప్రణాళికల కాలంలో నాగార్జున సాగర్, మాలంపూయ, కోసి, హీరాకుడ్, చంబల్, ఫరక్కా, శ్రీశైలం, తుంగభద్ర ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. ఆయన స్మృత్యర్థం పులిచింతల ప్రాజెక్టుకు కేఎల్ రావు ప్రాజెక్టుగా నామకరణం చేశారు. మూడుసార్లు రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు. 1986 మే 18న కన్నుమూశారు.

రాజం అయ్యర్ (జయంతి)



కర్ణాటక సంగీత గాత్ర విద్వాంసుడు 'పద్మభూషణ్' గ్రహీత రాజం అయ్యర్ 1922 జూలై 15న తమిళనాడు రాష్ట్రం కారైకుడిలో జన్మించారు. 20వ యేట తిరువాయూరులోని త్యాగరాజ ఆరాధన ఉత్సవంలో తొలిసంగీత కచేరీ ప్రదర్శించారు. ఆలిండియా రేడియలో టాప్ గ్రేడ్ ఆర్టిస్టుగా కొన సాగారు. ట్రావెన్‌కోర్ రాజవంశీయుల కుటుంబీకులకు సంగీతం నేర్పారు. తిరుప్పావై 30 పాశురాలకు స్వర కల్పన చేశారు. కళైమామణి, సంగీత కళా శిఖామణి, సంగీత ఆచార్య గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 2009 మే 9న కన్నుమూశారు.

అన్నివర్గాల అభ్యుదయవాది కెంపేగౌడ



కెంపేగౌడ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న అశ్వత్థనారాయణ తదితరులు

బంగారపేట, జూలై 14: సమాజంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షించిన నాడప్రభు కెంపేగౌడ దూరదృష్టితో బెంగళూరు నగరాభివృద్ధికి పునాదులు లేశారని మాజీ ఉపముఖ్యమంత్రి అశ్వత్థనారాయణ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కెంపేగౌడ కల్యాణ మండపంలో తాలూకా ఒక్కలిగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన కెంపేగౌడ 515వ జయంతిలో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయం, వాణిజ్యరంగాలను ఇతోధికంగా ప్రోత్సమించి చరిత్రలో తనదైన ఖ్యాతిని పొందారన్నారు. ప్రస్తుత అధికార పార్టీ కెంపేగౌడ విమానాశ్రయం తమ సాధనగా గొప్పలుగా చెప్పుకుంటు న్నాయని అయితే వారి హయాంలో విమానాశ్రయానికి స్థలం ఇవ్వలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పలు అడ్డంకులను ఎదుర్కొని 24 ఎకరాల భూమిని విమానాశ్రయానికి కేటాయించామన్నారు. రాష్ట్రంలోని చారిత్రాత్మక ప్రదేశాలనుంచి మట్టిని సేకరించి 108 అడుగుల ఎత్తైన కెంపేగౌడ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉద్యానవనాన్ని నిర్మించడ మా సాధన అన్నారు. మాజీ ఎంపీ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ వైభవాన్ని చాటే డొళ్ళు కుణిత, పులివేషం, డీజే తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఓబుళమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: డీఆర్‌డీఏ-వెలుగు అనంతపురం పీడీగా ఓబుళమ్మ నియమితులయ్యారు. డీఎల్‌డీఓ ఓబుళమ్మను డీఆర్‌డీఏ-వెలుగు ఎఫ్‌ఏసీ పీడీగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఓబుళమ్మ డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇదివరకు పీడీగా ఉన్న నరసింహారెడ్డి దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. దీంతో ఏపీడీగా ఉన్న ఈశ్వరయ్య ఇప్పటి వరకు ఎఫ్‌ఏసీ పీడీగా కొనసాగారు.

సిద్ధమవుతున్న బొజ్జ గణపయ్యలు



తయారీదశలో ఉన్న విగ్రహాలు

దొడ్డబళ్ళాపుర, జూలై 14: ప్రజలంతా ఉత్సాహంగా జరుపుకొనే వినాయక చవితి పండుగకు బొజ్జ గణపయ్యలు సిద్ధమవుతున్నాయి. పండుగకు ఇంకా రెండు నెలల సమయం ఉండగానే విగ్రహాలు రూపొందుతున్నాయి. భూగర్భ జలాలు కలుషితం కాకుండా రసాయనిక రంగులు వాడకుండా విగ్రహాలు తయారు చేయాలని అధికారులు సూచించారు. అయితే కొన్ని చోట్ల ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంగులతో కూడా విగ్రహాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. తయారీదారులకు కట్టుదిట్టమైన హెచ్చరికలు చేశారు. పర్యావరణానికి హాని కలగని రీతిలో విగ్రహాలు ఉండాలని అలా లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీఓపీ అనేది నీటిలో కరగని వస్తువు. ఇది వాడడం వల్ల గౌరీ గణేశ విగ్రహాలను నిమజ్జనం చేయడం ద్వారా బావులు, చెరువులు, కుంటలు ఇతరత్రా జలమూలాలు కలుషితం అవుతాయి. పశుపక్ష్యాదుల మనుగడ సాధించాలంటే రసాయన రంగులు వాడరాదని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

తయారీ కేంద్రాలపై దాడులు

దొడ్డబళ్ళాపుర తాలూకాలోని శివారులో మారసంద్రలో వినాయకుడి విగ్రహాల తయారీకి సంబంధించి 9 కేంద్రాలు ఉన్నాయి. అనేక కేంద్రాలలో రసాయన లేపిత, పీఓపీ మూర్తులను తయారు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పర్యావరణ ప్రేమికుల డిమాండ్‌తో పర్యావరణ కాలుష్య నియంత్రణ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు వినాయక తయారీ విభాగాలపై దాడులు నిర్వహించారు. ఒక కేంద్రంలో దాడులు చేస్తున్నారనే సమాచారంతో ఇతర విభాగాల నిర్వాహకులు తాళాలు వేసి వెళ్లిపోవడం గమనార్హం.

అధికారుల తీరుపై అసంతృప్తి



అధికారుల తనిఖీలు

అధికారుల దాడులపై యువ నాయకుడు చిదానంద మూర్తి మాట్లాడుతూ పర్యావరణ కాలుష్య నియంత్రణ అధికారుల కార్య వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చే శారు. గత ఏడాదే పీఓపీ విగ్రహాల తయారీపై నిషేధం ఉన్నా పలు చోట్ల తయారీ కొన సాగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. దాడుల సందర్భంగా పాత విగ్రహాలు గుర్తించామని ప్రస్తావించారని, పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికారులు నామ మాత్రంగా వ్యవహరిస్తున్నారంటూ ఆక్రోశం వ్యక్తం చేశారు. ని బంధనలు ఉల్లంఘిస్తే 1974 యాక్ట్ 45-1 ప్రకారం రూ.10వేల జరిమానా, జైలుశిక్ష అవకాశం ఉంది. అంతేకా కుండా తప్పనిసరిగా ఐదు అడు గులకు మించిన గణేశ విగ్రహాలు తయారు చేయరాదని కాలుష్య నియంత్రణ మండలి సూచించింది. పండుగలు పర్యావరణ స్నేహిగా ఉండాలని, కాలుష్యం కారాదనే ఉద్దేశ్యంతోనే మట్టి విగ్రహాలను పూర్వీకులు తయారు చేసేవారని అదే విధానా న్ని పాటించి సహకరిద్దామని పర్యా వరణ ప్రియులు కోరు తున్నారు. ఇందుకు తయారీదారులు కూడా సహ కరించాలని కోరారు. కొన్ని చోట్ల ఇళ్లలోనే పసుపు లేదా పసుపుతో కూడిన గోధుమపిండితో రూపొందించిన విగ్రహాలను తయారు చేస్తున్నారని ఇటువంటి విగ్రహాల ద్వారా పర్యావరణానికి ఏమాత్రం హాని ఉండదని ఇలాంటి విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేసి నిమజ్జనం ద్వారా ఎటువంటి సమస్య ఉండదని పలువురు అభి ప్రాయపడుతున్నారు.

ప్రతి ఒక్కరికి రాజ్యాంగంపట్ల అవగాహన ఉండాలి

- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్‌దాస్



ప్రసంగిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ హెచ్ఎన్ నాగమోహన్‌దాస్

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం పట్ల సమగ్ర అవగాహన ఉన్నవారికి గందరగోళం ఉండదని సంక్లిష్ట పరిస్థితుల్లోనూ ఖచ్చితమైన నిర్ణయాలను తీసుకోగలరని హైకోర్టు మాజీ న్యాయమూర్తి హెచ్ఎన్ నాగమోహన్ దాస్ అభిప్రాయపడ్డారు. సంవిధాన ఓదు (రాజ్యాంగం చదవండి) పేరిట రెండు రోజుల ప్రసంగాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. రిచ్‌మండ్ రోడ్డులోని ఆశీర్వాదంలో జరిగిన కార్యక్రమంలో రచయిత ఎంఎస్ ఆశాదేవి, కవి రాజప్ప దళవాయి, న్యాయవాది అనంతనాయక్‌లు పాల్గొన్నారు. రాజ్యాంగం చదవండి అనే కార్యక్రమంలో రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలనుంచి వందమంది ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు. వీరిలో విద్యార్థులు, ఉద్యోగులు, యువతులు ఉన్నారు. ఈ సంద ర్భంగా రిటైర్డు జస్టిస్ నాగమోహన్‌దాస్ మాట్లాడుతూ రిజర్వేషన్, అన్ని మతాలను సమానంగా భావించడమే సెక్యులరిజం లక్ష్యమన్నారు. రిజర్వేషన్ అనేది సామాజిక న్యాయంలో ఓ చిన్నభాగమే అన్నారు. మహిళలు, వృద్ధులు, రైతులు, కార్మికులు, శోషితవర్గాల వారికి రక్షణ కల్పించడమే సామాజిక న్యాయమన్నారు. ప్రజలకు అర్థమయ్యే రీతిలో రాజ్యాంగంలోని అంశాలను చేర్చాల్సి ఉందన్నారు. ఏదైనా అంశంపై మాట్లాడాలంటే ముందుగా సమగ్ర అవగాహన పొందాలని ఆ తర్వాత సొంతంగా రిహార్సల్స్ చేసుకోవాలన్నారు. ఒక సభ లేదా వేదికపై మాట్లాడేముందు మీ హావభావాలు సదరు అంశానికి సంబంధించిన హాస్యం కూడా తోడవ్వాలని అప్పుడే మీ పట్ల సభికులు ఆకర్షితులు అవుతారన్నారు. రాజ్యాంగంతోపాటు సమాజంలో నిత్యం జరిగే అంశాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతిరోజూ పుస్తకాలు, పత్రికలు చదవాలని అప్పుడే చర్చాగోష్టులలో మీ అభిప్రాయాన్ని పొందుపరచడం సాధ్యమన్నారు. వివిధ జిల్లాలనుంచి వచ్చిన వారు అస్పృశ్యత, గ్రామీణ ప్రాంతాలలో వెనుకబాటు, రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి అవసరాలు, సమాజంలో పేదలపట్ల ప్రభుత్వాలు తీసుకోవాల్సిన విధానాలు పలు అంశాలపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

కారుణ్య మరణం కోరుతూ గవర్నర్‌కు లేఖ

- నియామకాల జాప్యంపై అభ్యర్థి అసిస్టెంట్ లెక్చరర్ ఆవేదన

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నియామకపు ఆదేశాలు జారీ చేయకపోవడంతో విసుగు చెందిన ఓ అసిస్టెంట్ లెక్చరర్ అభ్యర్థి కారుణ్య మరణం కోరుతూ గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లోట్‌కు లేఖ రాశారు. ఆదివారం సదరు లేఖ సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది 2021లో ఎంపికైన 1208మంది అసిస్టెంట్ లెక్చరర్ అభ్యర్థులకు నియామకపు పత్రాలు జారీ చేయలేదని ఓ అభ్యర్థి గవర్నర్‌కు కారుణ్యమరణం కోరుతూ లేఖ పంపారు. 2021 సెప్టెంబరు 30న ప్రక్రియ ఆరంభమైంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ లెక్చరర్‌ల నియామకాలకు 2023 నవంబరు 4న గెజిట్‌లో ప్రకటించారు. ఉద్యోగంలో చేరి మూడేళ్ల సర్వీసు ముగియాల్సి ఉండేదిన కానీ నియామకపు పత్రాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నా రన్నారు. ఉద్యోగం వచ్చిందని సంతోషం కలిగినా అపాయింట్‌మెంట్ ఆర్డర్ రాక పోవడంతో దిక్కుతోచడం లేదన్నారు. ఇతర ఉద్యోగాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని మరోవైపు వయసు తేడా వస్తోందని లేఖలో ప్రస్తావించారు. వెంటనే ప్రభుత్వా నికి దిశానిర్దేశం చేయాలని ప్రస్తావించారు. సీఎం, డీసీఎం, ఉన్నత విద్యాశాఖ మంత్రులకు ఎక్స్ ద్వారా ట్యాగ్ చేశారు.


DRDO
080 2225 4102
PIN 5 6 0 0 0

గవర్నర్‌కు రాసిన లేఖ ఇదే...

డెంగీ నియంత్రణపై జాతా



జాతాలో పాల్గొన్న అధికారులు తదితరులు

శిడ్లఘట్ట, జూలై 14: ఇటీవల డెంగీ జ్వరాలు ప్రబలుతున్న తరుణంలో నియంత్రించే దిశగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేతృత్వంలో అవగాహన జాథా నిర్వహించారు. మార్గదర్శి దివ్యాంగుల స్వచ్ఛంద సేవాసంస్థ, బెంగళూరు ఎస్‌సిఐ నవజీవన సేవా సంఘం, చిక్కబళ్ళాపుర సంస్థలు సహకారం అందించాయి. ఇదే సందర్భంగా జంగమకోటె హోబళిలోని దివ్యాంగ విద్యార్థులకు బ్యాగులు, లేఖనా సామగ్రి పంపిణీ చేశారు. బెంగళూరుకు చెందిన స్టేట్‌స్ట్రీట్ స్వచ్ఛందసంస్థ నుంచి 60మంది వలంటీర్లు పాల్గొన్నారు. మార్గదర్శి సంస్థ నుంచి పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మార్గదర్శి సంస్థ ముఖ్యులు శాంతలా మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు సమాజంలో ప్రతి ఒక్కరూ అవకాశం కల్పించడం ద్వారా సమాజంలోని ప్రధాన జనజీవస్రవంతిలోకి తేవాలన్నారు. ప్రభుత్వ హైస్కూల్ టీచర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ బెంగళూరులోని ఐటీబీటీ కంపెనీ ఉద్యోగులు వారాంతంలో విందులు వినోదాలకు సమయం కేటాయించడాన్ని చూశానని అయితే స్టేట్‌స్ట్రీట్ సంస్థ ఉద్యోగులు వెనుకబడిన గ్రామాన్ని ఎంపిక చేసుకుని ప్రభుత్వ పాఠశాలకు విచ్చేసి స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటడం, లేఖనా సామగ్రి ఇవ్వడం అభినందనీయమన్నారు. నవజీవన సంస్థ శిడ్లఘట్ట తాలూకా అధ్యక్షుడు బెళ్ళూటి మునిరాజు మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతం కావడానికి ఎంతోమంది దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారం ఉందన్నారు. విద్యార్థులు చక్కగా చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. జంగమకోటె గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సుజాత నరసింహయ్య అధ్యక్షత వహించగా గ్రామ పంచాయతీ సభ్యులు ఫయాజ్, వెంకటేశ్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, అకౌంటెంట్ మంజునాథ్, జంగమకోటె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు డాక్టర్ అంబికా, పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షురాలు మహబూబ్‌పాషా, హైస్కూల్ ఉపాధ్యాయులు సుష్మా, నాగరత్న, లతా మేఘజోషి, వెంకటలక్ష్మమ్మ, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి సీబీ ప్రకాశ్, బీఆర్‌సీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ దర్శనానికి వెళుతూ ప్రమాదం

- ఏడుగురికి తీవ్ర గాయాలు
- బాధితులది కర్ణాటక రాష్ట్రం



ప్రమాదానికి కారణమైన బొలేరా వాహనం

చౌడేపల్లె, జూలై 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దర్శనం కోసం వెళుతూ బొలేరో వాహనం బోల్తా పడ్డ సంఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం జరిగింది. కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా కేజీఎఫ్ తాలూకా పుగనపల్లె, కొడిగిపల్లె, హన్కూర్ గ్రామాలకు చెందిన వెంకట్రాప్ప కుటుంబికులు, తమ బంధు మిత్రులతో కలసి బోయకొండ గంగమ్మ దర్శనం చేసుకుని మొ క్కులు తీర్చుకునేందుకు బొలేరో వాహనంలో వచ్చారు. ఈక్రమంలో మండలంలోని కర్ణంవారిపల్లె సమీపంలో బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో వెంకట్రామయ్య(60), సుగుణమ్మ(35), సుబ్బరత్న(55), కృష్ణమ్మ(45) సుమ(29), నారాయణమ్మ(40),సుశీలమ్మ(45)లు తీవ్రంగా గాయపడగా, మరి కొందరు సల్పంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించారు. పుంగనూరు, చౌడేపల్లె నుంచి రెండు 108 వాహనాలు రాగా ఈఎంటీ గణేష్ వారికి ప్రథమ చికిత్సలు చేసి, మెరుగైన చికిత్సల కోసం పుంగనూరు ఏరియా అసుపత్రికి తరలించారు.




గాయపడ్డ క్షతగాత్రులు

గురుపూజా మహోత్సవానికి సన్నాహాలు

చింతామణి, జూలై 14: తాలూకాలోని పుణ్యక్షేత్రం కైవారలోని యోగినారేయణ మఠంలో ఈనెల 19నుంచి మూడు రోజులపాటు జరిగే గురుపూజా మహోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దేశంలోని వేర్వేరు ప్రాంతాలనుంచి విచ్చేసే సంగీత విద్వాంసులను స్వాగతించేందుకు కైవార సిద్ధమవుతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని గురువులను స్మరిస్తూ కార్యక్రమాలు నిర్వహించడం కొన్నేళ్లుగా వస్తోంది. కైవార యోగినారేయణ తాతయ్య తమ కీర్తనలలో గురువుల మహత్యాన్ని వేనోళ్ల పొగిడారు. ఇంతటి గురుపరంపరను కాపాడేలా గురుపూజా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు కైవార ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం తెలిపారు. యోగినారేయణ సంకీర్తనా ప్రాజెక్టు సంచాలకులు వానరాశి బాలకృష్ణ భాగవతర్ మాట్లాడుతూ దేశవిదేశాలలో పేరొందిన సంగీత కళాకారులు, విద్వాంసులను ఒకేవేదికపై చేర్చడమే కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. ఇందులో స్థానిక కళాకారులకు కూడా అవకాశం కల్పిస్తూ వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేలా మఠం చేపడుతోందన్నారు. మఠం పాలనాధికారి లక్ష్మీనారాయణ్ మాట్లాడుతూ మఠం సభా ప్రాంగణాన్ని ప్రత్యేకంగా సిద్ధం చేసే పనులు సాగుతున్నాయన్నారు. విశాలమైన షెడ్‌లు నిర్మిస్తున్నామన్నారు. సంగీత కళాకారులు, భక్తులకు వసతి, భోజన వ్యవస్థ కల్పించనున్నట్టు తెలిపారు. కైవార క్రాస్‌లో భారీ స్వాగత తోరణాన్ని నిర్మించామన్నారు. ఆలయాన్ని ప్రత్యేకంగా దీపాలంకరణ చేస్తున్నామన్నారు.

ఒక్కలిగ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాల గ్రహీతలతో ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ తదితరులు

హొస్కోటె, జూలై 14: అందరూ విద్యావంతులు కావాలన్నది రాష్ట్రకవి కువెంపు ఆశయమని హొస్కోటె ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ అభి ప్రాయపడ్డారు. హొస్కోటెలోని శ్రీవారి కల్యాణమండపంలో ఒక్కలిగ సంఘం ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ ప్రతిభావంత విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలోని అన్నివర్గాల వారితో ఒక్కలిగ వారు సత్సంబంధాలు కలిగి ఉన్నారన్నారు. తాలూకా విద్యార్థిని కన్నడ మీడియంలో ప్రథమస్థానం పొందడం ద్వారా తాలూకా కీర్తిని చాటారన్నారు. అందరూ చక్కగా చదువుకుని మరింత రాణించాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపీ బీఎన్ బచ్చేగౌడ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో భారీగా ఫీజులు చెల్లించి చేరుతున్నారని, అయితే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య అందుతున్నా ఉపాధ్యాయుల కొరత ఉందని ఈ వ్యవస్థ మార్పు రావాలన్నారు. గతంలో పరీక్షల విధానానికి ప్రస్తుతానికి ఎంతో తేడా ఉందని, సీసీటీవీ నిఘా నడుమ కొనసాగుతున్నాయని పరిశ్రమతోనే రాణిం చగలరన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ కుమార్, ఈఓ నారాయణస్వామి, సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నాగరాజ్, పారిశ్రామికవేత్త బీవీ భైరేగౌడ, ప్రముఖులు రాజశేఖరగౌడ, కోడిహళ్ళి సురేశ్, సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

లాజిస్టిక్స్‌లో ఉత్తమ అవార్డు

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సప్లయ్ చెయిన్ మేనేజిమెంట్ అండ్ లాజిస్టిక్స్ విభాగం 2024 ఏడాదికి సంబంధించి ప్రకటించిన పురస్కారాలలో లాన్సెస్ ఇండియాకు రజత పతకం లభించింది. ఈ మేరకు బెంగళూరులో కంపెనీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పయనీరింగ్ రిస్క్ మిటిగేషన్ స్ట్రాటజీస్ విభాగంలో అవార్డు దక్కడం సంతోషంతోపాటు బాధ్యత పెంచిందని కంపెనీ ముఖ్యులు మహేంద్ర కల్కె తెలిపారు. వస్తువులను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి సురక్షితంగా రవాణా చేసేందుకు సరఫరా విధానం కీలకమవుతుందన్నారు. లాన్సెస్ ఇండియా డ్రైవింగ్ ఇన్నోవేషన్, సేఫ్టీ, సుస్థిరతను పాటిస్తోందన్నారు. ప్రమాదరహిత పరిశ్రమ కొనసాగించడమే లక్ష్యమన్నారు. వైస్ ఛైర్మన్ అండ్ ఎండీ నమితేశ్ రాయ్ చౌదరి అభిప్రాయం మేరకు వ్యాపారంలో సుస్థిరతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

సర్జాపుర పోలీసుల స్వచ్ఛతా అభియాన



స్వచ్ఛతలో పాల్గొన్న పోలీసు సిబ్బంది

దొమ్మసంద్ర, జూలై 14: ఆనేకల్ తాలూకాలోని సర్జాపుర పోలీసులు స్వచ్ఛతా అభియాన చేపట్టారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ నేతృత్వంలో ఆదివారం స్వచ్ఛతా పనులు నిర్వహించారు. స్టేషన్ ప్రాంగణంలో పేరుకున్న చెత్తాచెదారాన్ని తొలగించారు. స్టేషన్ ఆవరణలో దుస్థితిలో ఉన్న ఒక కట్టడం ఉంది. దీంతో ఈ భవనం చుట్టూ ముళ్లకంపలు, పనికిరాని మొక్కలు పెరిగాయి. ఇటీవల వర్షాలతో దోమల బెడద పెరిగింది. ఇలా సిబ్బంది అంతా చేరి పేరుకున్న చెత్తా చెదారాన్ని తొలగించారు.

విద్యార్థులకు షూ వితరణ

బాగేపల్లి, జూలై 14: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇతర పాఠశాల విద్యార్థుల కంటే మరింత చక్కగా చదువుకునేలా అన్ని సౌలభ్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని పి.ఎం.శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ హనుమంతరెడ్డి తెలిపారు. పట్టణంలోని 2024-25 విద్యా సంవత్సరానికి పి.ఎం.శ్రీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 461 మంది విద్యార్థులకు షూ, రెండు జతల సాక్సులను అందచేశారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడంలో భాగంగా యూనిఫాం, షూ, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు కల్పిస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రిటైర్డు వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేష్, కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణు, ఎస్‌డీఎంసీ అధ్యక్షురాలు ఉషా, సభ్యులు భారతి, నరసింహప్ప, ఉపాధ్యాయులు ఏ మంజునాథ్ రెడ్డి, ప్రభావతి, ధర్మపుత్రి తదితరులు పాల్గొన్నారు.